క్లుప్తంగా

నేడు సహస్ర తులసీ దళార్చన

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సాప్ చేయాలి.

సింహాచలం రైల్వే స్టేషన్‌లో మాక్ డ్రిల్



మాక్ డ్రిల్‌లో భాగంగా ప్రయాణికుల బ్యాగులు చెక్ చేస్తున్న పోలీసులు

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పీ, రైల్వే, గోపాలపట్నం పోలీసులతో పాటు పలు విభాగాల పోలీసులు సంయుక్తంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. డీఎస్పీ రఘువీర్ ఆదేశాల మేరకు రైల్వే స్టేషన్‌లో మాక్ డ్రిల్ చేపట్టారు. రైల్వే స్టేషన్‌లో అసాంఘిక శక్తులు ప్రవేశిస్తే ఏవిధంగా చర్యలు తీసుకోవాలన్న అంశంపై పలు కృత్యాలు చేశారు. అనుమానిత ప్రయాణికుల బ్యాగులు చెక్ చేశారు. బ్యాగుల్లో పేలుడు పదార్థాలు, మారణాయుధాల రవాణాను ఏవిధంగా అడ్డుకోవాలో ప్రాక్టీస్ చేశారు. కార్యక్రమంలో సీఐ మహేష్, ఎస్ఐ బీపీ రావు, గోపాలపట్నం స్టేషన్ ఎస్ఐ అప్పలనాయుడు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కిరాణాషాపులు, దుకాణాల్లో తనిఖీలు



బాటజంగాలపాలెంలో కాటాలను తనిఖీ చేస్తున్న తూనికల శాఖ అధికారులు

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లోని షాపులు, దుకాణాలపై తూనికలు, కొలతల శాఖ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. మండలంలోని బాటజంగాలపాలెం,నారపాడు,అమ్ములపాలెం,నల్లరేగుల పాలెం గ్రామాల్లోని కిరాణా షాపులు,చికెన్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి 10 కేసులు నమోదు చేశారు. తూనికలు,కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో కిరాణా షాపులు,చికెన్ సెంటర్లలో తూనికల్లో అవకతవకలు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

సింహాచలం: ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని రవీంద్రభారతి పాఠశాల జోనల్ మేనేజర్ రమ్య అన్నారు. నో ప్లాస్టిక్ డేను పురస్కరించుకుని సుజాతనగర్ రవీంద్ర భారతి పాఠశాల విద్యార్థులు బుధవారం ప్రధాన రహదారిపై రెండు కిలోమీటర్ల మేర ర్యాలీ నిర్వహించారు. పర్యావరణాన్ని నశింపజేసే ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్టాప్ ప్లాస్టిక్-సేవ్ ఎర్త్ అనే గేయాన్ని విద్యార్థులు ఆలపించారు. పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ, జోనల్ ఇన్‌చార్జి వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్-3 రైల్వే ట్రాక్‌పై పడి ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దువ్వాడ రైల్వేస్టేషన్ జీఆర్‌పీ ఎస్ఐ శాంతారామ్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం దువ్వాడ రైల్వేస్టేషన్‌లోని మూడో ప్లాట్‌ఫామ్ వద్ద సుమారు 50 సంవత్సరాల వయసు ఉన్న వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. నలుపు ట్రాక్, నీలంరంగు టీ షర్ట్, హవాయి చెప్పులు ధరించి ఉన్న వ్యక్తి వివరాలు తెలియకపోవడంతో మృతదేహానికి పంచనామా నిర్వహించి అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపర్చినట్లు ఆయన తెలిపారు. వివరాల కోసం 76739 06010 నంబర్‌ను సంప్రదించాలని ఎస్ఐ కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ప్రతి సమస్య పరిష్కారానికే గడ పగడపకు..



సబ్బవరంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: స్థానికంగా ఉండే ప్రతి సమస్యను గుర్తించి పరిష్కరించేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చెప్పారు. సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధిలోని సాయినగర్ కాలనీలో ఆయన బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కాలనీలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గణాంకాలతో ఆయా కుటుంబాలకు వివరించారు. ప్రభుత్వ సేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఉండే సమస్యలపై ఆరా తీశారు. ఎస్సీ కాలనీలో విద్యుత్ లైన్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కాలనీలో డ్రైన్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు.దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్ విద్యుత్, పంచాయతీరాజ్ సిబ్బందితో మాట్లాడి ప్రతి పాదనలు సిద్ధ చేయాలని ఆదేశించారు. త్వరలోనే పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సాయినగర్ కాలనీలో 50 అడుగుల రోడ్డును రూ.50 లక్షలతో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు

కార్యక్రమంలో భాగంగా సబ్బవరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రారంభించారు. సబ్బవరం పంచాయతీ కార్యాలయం ఆవరణలో రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయ అదనపు అంతస్తుతో పాటు సాయినగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, పార్టీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, నాయకులు సబ్బవరపు ముత్యాలనాయుడు, గొర్లి ఉమా మహేశ్వర రావు,ఎంపీడీవో రమేష్ నాయుడు, తహసీల్దార్ సత్యనారాయణ,సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాద రావు,ఉప సర్పంచ్ మండల లక్ష్మణ,ఎంపీటీసీ బైలపూడి దేముడు తదితరులు పాల్గొన్నారు.

సేవా మూర్తులు

సింహాచలం/పరవాడ : వలంటీర్ వ్యవస్థ సేవకు మారుపేరుగా నిలిచింది. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు నియమించిన వలంటీర్లు నిజాయితీగా సేవలందించి ప్రజల మన్ననలు అందుకుంటున్నారు. కరోనా విపత్తు వేళ వారు అందించిన సేవలకు ఎన్నో ప్రశంసలు దక్కాయి. రోగులకు మందులు, పౌష్టికాహారం అందించి ఎంతోమంది ప్రాణాలు నిలిపారు.

తలుపు తట్టి పథకాలు అందిస్తూ..

లబ్ధిదారుల ఇంటికే వెళ్లి ఠంచన్‌గా పింఛన్ అందించడంతో పాటు ప్రతీ కుటుంబానికి ఏయే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయో తెలియజేస్తూ వారితో దరఖాస్తు చేయించి, నేరుగా పథకాల లబ్ధిని అందేలా సహకరిస్తున్నారు. కుల, ఆదాయ, ఫ్యామిలీ మెంబర్, మ్యారేజ్ తదితర సర్టిఫికెట్లను అందించడంతో దరఖాస్తుదారులు వారి సేవలను కొనియాడుతున్నారు. రేషన్ వాహనం ఎప్పుడు వస్తుందో తెలియజేయడం.. ఇలా అన్ని విధాలుగా సహకారం అందిస్తూ లబ్ధిదారులకు తలలో నాలుకలా మెలగడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పవన్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి



వలంటీర్లనుద్దేశించి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ నేడు దేశానికే ఆదర్శంగా నిలిచింది. వలంటీర్ల వ్యవస్థను దేశంలో ఉన్న పలు రాష్ట్రాలకు చెందిన వారు కూడా మెచ్చుకున్నారు. ఆ విషయం మరిచి పవన్ అక్కసుతో వలంటీర్ వ్యవస్థపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. సేవాదృక్పథంతో పనిచేస్తున్న వలంటీర్లకు పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలి.

–గణపతి, 513 సచివాలయం, పెందుర్తి

నాకు చాలా గర్వంగా ఉంది



మత్స్యకార కుటుంబంలో జన్మించి అంగవైకల్యంతో ఉన్న నన్ను వలంటీరుగా నియమించారు. అప్పటి నుంచి నా పరిధిలో 50 కుటుంబాల వద్దకు ట్రైసైకిల్‌పై వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వారి మన్ననలు పొందుతున్నాను. నా పరిధిలో ఉన్న వృద్ధుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందించినపుడు వారి కళ్లలో ఆనందం వెల్లువిరుస్తుంది. నాకు అది చాలా గర్వంగా ఉంది. నాకు ఉపాధితో పాటు నలుగురికి ఉపయోగపడే పని కల్పించిన ప్రభుత్వానికి రుణపడి ఉంటా.

– కంబాల మసేను,వలంటీరు, ముత్యాలమ్మపాలెం

జగనన్నకు రుణపడి ఉంటా..



జగనన్న ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థ తీసుకురాకుంటే నేను గృహిణిగా ఇంటికే పరిమితమయ్యేదాన్ని. డిగ్రీ పూర్తి చేసిన నాకు ప్రభుత్వం వలంటీరుగా పనిచేసే అవకాశం కల్పించింది. నా పరిధిలో వారికి ప్రభుత్వం పథకాలు చేరవేయడానికి కృషి చేస్తున్నా. ప్రజా సేవకు అవకాశం కల్పించిన జగనన్నకు రుణపడి ఉంటా. మాపై విమర్శలు చేసిన పవన్‌కు జ్ఞానోదయం కలగాలి.

– సీహెచ్ రమ్య, వలంటీరు, తానాం

వలంటీర్లు వచ్చాక ఇబ్బందులు లేవు



గతంలో ప్రభుత్వాలు అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి మాకు తెలిసేవి కాదు. వలంటీరు వ్యవస్థ వచ్చాక సమస్య తీరింది. మా వలంటీరు ఇంటికి వచ్చి ఎప్పుడు ఏ పథకానికి దరఖాస్తు చేసుకోవాలో చెబుతుంది. నాలుగేళ్ల కాలంలో పలు పథకాల ద్వారా నా పేరు మీద ఉన్న బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ అవుతుంది. ఈ విషయంలో వలంటీరు సాయం ఎంతో ఉంది.

– కూండ్రపు ముత్యాలమ్మ, లబ్ధిదారు, వెన్నలపాలెం

ఉపాధ్యాయ వృత్తి వెలకట్టలేనిది



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న వైస్ ఎంపీపీ అప్పలరాజు తదితరులు

పరవాడ: విద్యార్థుల మనసు దోచుకునే ఉపాధ్యాయులు ధన్యులని పరవాడ వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు అన్నారు. వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పని చేసి స్వచ్ఛంద విరమణ పొందిన గణిత ఉపాధ్యాయురాలు జి.సుజాత, బదిలీ అయిన పాఠశాల హెచ్‌ఎం కర్రి జగన్‌మోహన్‌నాయుడు, ఉపాధ్యాయులు ఎస్.ఖగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, ఎం.పద్మలత, ఆర్.విజయలత, డి.గాయత్రిలను బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. అనంతరం వైస్ ఎంపీపీ, మాజీ ఎంపీపీలు మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి వెలకట్టలేనిదన్నారు. సన్మాన సభలో పాఠశాల హెచ్‌ఎం పందిరి కనకేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ పి.పద్మావతి, లంకెలపాలెం పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు, వైస్ సర్పంచ్ కూండ్రపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కార్మికులకు అండగా నిలుస్తాం

మల్కాపురం: గంగవరం పోర్టు కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని సీఐటీయూ మల్కాపురం జోన్ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి అన్నారు. గంగవరం పోర్టు కార్మికులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద బుధవారం నిరసన చేపట్టారు.సీఐటీయూ నాయకుడు పెంటారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లక్ష్మణమూర్తి మాట్లాడుతూ పోర్టు యాజమాన్యం మొండి వైఖరి వల్ల పని చేస్తున్న కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్య కల్యాణం నిర్వహించారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు. అలాగే స్వామికి సహస్రనామార్చన పూజ ఘనంగా నిర్వహించారు. 1001 నామాలను పఠిస్తూ స్వామికి అర్చన చేశారు. అర్చకులు కె.కె.రఘునాథాచార్యులు తదితరులు ఈసేవలను నిర్వహించారు.

పదవీ విరమణ వయస్సు పెంపుపై హర్షం

ఏయూ క్యాంపస్: ఆచార్యుల పదవీ విరమణ వయస్సును 62 నుంచి 65 సంవత్సరాలకు పెంపుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ఏపీ యూనివర్సిటీ టీచర్స్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు ఆచార్య జాలాది రవి ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాలలో బోధన సిబ్బంది కొరత తీరేలా నిర్ణయం తీసుకోవడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎర్న్‌డ్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ మంజూరు చేయడంపై కూడా హర్షం వ్యక్తం చేశారు.

మహిళల పోరుయాత్ర పోస్టర్ విడుదల



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఐద్వా ప్రతినిధులు

పరవాడ: హింసపై ఐద్వా ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి ఆగస్టు 9 వరకు చేపట్టనున్న మహిళల పోరుయాత్రను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం పిలుపునిచ్చారు. వాడచీపురుపల్లిలో బుధవారం మహిళల పోరు యాత్రకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినతరం చేయాలని డిమాండ్ చేశారు. మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మండలానికి ఒక్క మద్యం షాపే ఏర్పాటు చేయాలని కోరారు. కళాశాలలు, పని ప్రదేశాల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా సహాయ కార్యదర్శి ఆర్.లక్ష్మి సభ్యులు కె.ఆదిలక్ష్మి, రత్నకుమారి, పార్వతి, సత్యవతి, గండి లక్ష్మి, నూకాలమ్మ పాల్గొన్నారు.

డీఈవో పాఠశాలల సందర్శన



మింది హైస్కూల్లో పీహెచ్ స్కేల్ ప్రయోగాన్ని డీఈవో చంద్రకళకు వివరిస్తున్న విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ 68వ వార్డు మింది జిల్లా పరిషత్ హైస్కూల్, రాంనగర్ ఎంపీపీ స్కూళ్లను బుధవారం సందర్శించారు. మింది హైస్కూల్‌లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ) బోర్డులను పరిశీలించిన అనంతరం విద్యార్థుల నోట్ బుక్స్ తనిఖీ చేశారు. పాఠ్యాంశాలు నోట్ బుక్స్‌లో రాసుకోవడంలో కొన్ని తేడాలను పరిశీలించారు. శ్రద్ధగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులు పీహెచ్ స్కేల్ నమోదును ప్రయోగాత్మకంగా డీఈవోకు చేసి చూపించారు. యూనిఫాం ధరించని విద్యార్థులను గుర్తించిన ఆమె ఇకపై యూనిఫాం ధరించి పాఠశాలకు రావాలని సూచించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా వడ్డించారు. విద్యార్థుల చదువుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గుడివాడ అప్పన్నకాలనీలోని రాంనగర్ ఎంపీపీ స్కూల్‌ను సందర్శించారు. విద్యార్థుల పుస్తకాలను, పాఠశాల పరిస్థితులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవోలు సునీత, విశ్వనాథ్, డీఈఈ నర్సింగరావు, హెచ్‌ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్. ఆంజనేయ, రాంనగర్ ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం అబ్రహం లింకన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల హాస్టల్‌లో ఏర్పాటు చేసిన మంచినీటి శుద్ధి యంత్రాన్ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ బుధవారం ఉదయం ప్రారంభించారు. అనంతరం సైన్స్ కళాశాల పరిధిలోని హాస్టళ్ల మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. పనుల ప్రగతిని చీఫ్ ఇంజినీర్‌ను అడిగి తెలుసుకున్నారు. పనుల నాణ్యతను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శంకరరావు, చీఫ్ వార్డెన్ ఆచార్య కె.రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మానవ హక్కుల కౌన్సిల్ వార్షికోత్సవం



ఆచార్య సత్యనారాయణను సత్కరిస్తున్న కౌన్సిల్

దాబాగార్డెన్స్ : మానవ హక్కులను పరిరక్షించడమే ప్రథమ కర్తవ్యమని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ 24వ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దామోదర సంజీవయ్య లా కాలేజీ మాజీ ఉపకులపతి ఆచార్య వై. సత్యనారాయణ పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికీ ప్రజల్లో తమకు గల హక్కులపై సరైన అవగాహన లేకపోవడంతోనే అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆచార్య వై. సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికీ మహిళలు, చిన్నారులపై లైంగిక వేధింపులు, దాడులు జరగడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఏయూ డాక్టర్ అంబేద్కర్ లా కాలేజీ ఆచార్య విజయలక్ష్మి మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు ప్రతి పౌరుడు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆచార్య వై. సత్యనారాయణను కౌన్సిల్ సత్కరించింది. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పి. జగన్మోహనరావు, రిటైర్డ్ పోలీస్ అధికారి ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

'ఈ-చలానా రద్దు చేయాలి'



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న మోటారు యూనియన్ నాయకులు

సీతమ్మధార : మ్యాక్సి క్యాబ్‌కు పెంచిన రోడ్డు ట్యాక్స్, గ్రీన్‌ట్యాక్స్, ఈ చలానా రద్దు చేయాలని కోరుతూ టాటా మ్యాజిక్ డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మద్దిలపాలెం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి.జగన్ మాట్లాడుతూ రవాణా రంగం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ. మూడు లక్షల కోట్ల ఆదాయం వస్తుందన్నారు. తాము కట్టిన పన్నులో కనీసం ఐదు శాతం ఖర్చు పెడితే డ్రైవర్లందరికీ పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయవచ్చన్నారు. ఇన్సూరెన్స్ ప్రీమియం రూ. 12 వేల నుంచి రూ. 30 వేలకు పెంచడం అన్యాయమని, దీనిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఈ-చలానాలు రద్దు చేయాలన్నారు. పెంచిన రోడ్డు ట్యాక్స్ తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు పి.రాజ్‌కుమార్, సురేష్, సత్యనారాయణరెడ్డి, రాంబాబు, శ్రీనివాస్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



కోటేశ్వరరావు మృతదేహం

ఆరిలోవ: జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లావాసి మృతి చెందాడు. ఆరిలోవ ఎస్ఐ అప్పారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా బెలమాం గ్రామానికి చెందిన కోటేశ్వరరావు(40) ద్విచక్ర వాహనంపై నాలుగు రోజుల కిందట విశాఖపట్నం అల్లిపురంలో ఉన్న తన తమ్ముడి ఇంటికి వచ్చాడు. తిరిగి బైక్‌పై బుధవారం శ్రీకాకుళం బయలుదేరాడు. జూ పార్కు వద్దకు వెళ్లే సరికి వెనుక నుంచి మధురవాడ వైపు వెళ్తున్న బొలేరా వాహనం కోటేశ్వరరావు బైక్‌ను ఢీకొంది. తీవ్ర గాయాలు పాలై కొన ఊపిరితో ఉన్న ఆయన్ను స్థానికులు, ట్రాఫిక్ పోలీసులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఓ బాబు ఉన్నారు. మృతుడి చెల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని ఆటో డ్రైవరుకు తీవ్రగాయాలు




ప్రమాదంలో నుజ్జయిన ఆటో ముందుభాగం



తీవ్రంగా గాయపడిన ఆటోడ్రైవర్ రామకృష్ణ

కూర్మన్నపాలెం: లారీ ఢీకొని ఆటో డ్రైవరుకు తీవ్ర గాయాలైన ఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ మేరకు దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. పరవాడ మండలం ఈ.మర్రిపాలెం ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ తనుబుద్ది రామకృష్ణ బుధవారం తెల్లవారుజామున ఆటోలో కూరగాయలతో పాటు ఈశ్వరమ్మ, వరలక్ష్మి, లక్ష్మి అనే ముగ్గురు మహిళలను తీసుకొని గాజువాక రైతుబజారుకు బయలుదేరాడు. వడ్లపూడి జంక్షన్ వద్ద గాజువాక నుంచి ఆటోనగర్ వైపు వెళ్తున్న లారీ బలంగా ఢీకొంది. దీంతో ఆటో ముందు భాగం నుజ్జునుజ్జుకావడంతో పాటు ఆటోడ్రైవర్ రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆటోలో ఉన్న మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పేపర్ సంచుల వినియోగం అవసరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఏయూ క్యాంపస్: పేపర్‌తో తయారు చేసిన సంచుల వినియోగం పెంచాల్సిన అవసరం ఉందని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. బుధవారం ప్రపంచ పేపర్ బ్యాగ్ డేని పురస్కరించుకుని ఏయూ వీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పర్యావరణహితంగా నడుచుకోవాలని సూచించారు. విద్యార్థులను భాగస్వాములను చేస్తూ ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం మంచి పరిణామమన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన పేపర్ బ్యాగ్‌లను ప్రదర్శించారు. వీటిని కళాత్మకంగా తీర్చిదిద్దిన విద్యార్థులను అభినందించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మాట్లాడుతూ రీసైకిల్ చేయడానికి ఉపయుక్తంగా ఉండే కాగితం సంచులను వినియోగించాలనే సందేశాన్ని సమాజంలోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, ఎ.నరసింహారావు, డాక్టర్ నాగ రాజకుమారి, బోధన సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్ష కేంద్రాల పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశం పొందిన వారికి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. బుధవారం జరిగిన పరీక్ష కేంద్రాలను ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించడంపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్ట్స్ కళాశాల పరిధిలో 99, సైన్స్ కళాశాల పరిధిలో 72, ఇంజినీరింగ్‌లో 73, ఫార్మసీలో 12 మంది పరీక్షకు హాజరయ్యారు. మొత్తం పరీక్షకు 256 మంది దరఖాస్తు చేసినట్లు పరీక్షల విభాగం డీన్ ఆచార్య డి.వి.ఆర్.మూర్తి తెలిపారు.